క్లుప్తంగా

అసత్య ఆరోపణలు మానుకోవాలి

డిండి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆ పార్టీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఆ పార్టీ నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, సైదా, అంజి, రేణయ్య, రమేష్, సాయి, రాఘువేంద్ర ఉన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హామీల అమలులో విఫలమయ్యారని పేర్కొంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 'బై బై కేసీఆర్' నినాదాన్ని వైరల్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎండీ.ఖదీర్ మాట్లాడుతూ కేజీటూ పీజీ, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆడపిల్లలపైన జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమావత్ సేవానాయక్, కార్తిక్, నాగేంద్రబాబు, యేకుల సురేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీను శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం రావులపెంట గ్రామానికి చెందిన పిల్లి నాగరాజు తన ట్రాక్టర్ ద్వారా గ్రామంలోని మూసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు యజమాని నాగరాజుతోపాటు ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లోనూ అమలు చేయాలి



మాట్లాడుతున్న సైదానాయక్

మిర్యాలగూడ టౌన్: 'బెస్ట్ అవెలబుల్ స్కూల్' స్కీమ్‌ను గిరిజన ప్రాంతాల్లో అమలు చేయకపోవడం సరికాదని, వెంటనే డీటీడీవో నోటిఫికేషన్ వేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావూరి సైదానాయక్ కోరారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మిర్యాలగూడ పరిసరాల్లో అధికంగా గిరిజనులు ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతంలో బెస్ట్ అవెలబుల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందించాలన్నారు. ఈ సమావేశంలో ధీరావత్ ఠాగూర్ నాయక్, బస్సీలాల్‌నాయక్, గణేష్‌నాయక్, దేవేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'నగదు రహిత వైద్యం' జీఓ విడుదల చేయాలి

నల్లగొండ: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించేలా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు మోహన్‌రావు, జెల్ల శ్రీశైలం అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్ల పుల్లయ్య, శేషారెడ్డి, సుధాకర్, మోహన్ రావు, ఎండీ హుస్సేన్, కేశవచారి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులకు ఆదేశించారు. శనివారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే చిట్యాల పట్టణంలోని నాలుగో వార్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు సత్తయ్య, పాల్గొన్నారు.

సౌకర్యాలతో మైనార్టీ గురుకుల కళాశాల

- పిట్టలగూడెం ఎస్సీ హాస్టల్‌లో ఏర్పాటు
- మరమ్మతు పనులు పూర్తి
- జూన్ నుంచి తరగతుల నిర్వహణ



పిట్టలగూడెంలో ముస్తాబైన భవనం



కళాశాల భవనంలోకి చేర్చుతున్న సామగ్రి

గుర్రంపోడు : మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను నియోజకవర్గ స్థాయి మైనార్టీ బాలుర గురుకుల కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. గ్రామంలో దశాబ్దకాలం కిందట విద్యార్థులు లేక మూతబడిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కళాశాల కోసం ఎంపిక చేసి ఇటీవల మరమ్మతులు పూర్తిచేశారు. సువిశాల వరండా, గదులు కలిగిన ఈ భవనం మూతబడటంతో శిథిలమైన తలుపులు, కిటికీలు తొలగించి నూతనంగా ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యాలన్నింటికీ ఇటీవల రూ.12లక్షల నిధులు మంజూరుకాగా పనులు పూర్తి చేశారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 2017లో గురుకుల బాలుర మైనార్టీ పాఠశాల మంజూరు కాగా గుర్రంపోడు మండలంలో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అప్పట్లో సరైన వసతులు గల అద్దె భవనం ఈ ప్రాంతంలో లభించకపోవడంతో నిడమనూరు మండలంలో వేంపాడు వద్ద అద్దె భవనం ఎంపిక చేసి పాఠశాలను ప్రారంభించారు. గతేడాది ఆ గురుకులం ఇంటర్మీడియట్ వరకు అప్ గ్రేడ్‌అయింది. దీంతో పాఠశాల నుంచి కళాశాలను విడదీసి వేరే చోటకు మార్చాలని నిర్ణయించారు. ఇటీవల పిట్టలగూడెంలోని సాంఘిక సంక్షేమ శాఖ సొంత భవనం గల ఎస్సీ బాలుర వసతి గృహంను ఎంపిక చేసి మరమ్మత్తులు చేపట్టి జూన్ నాటికి కళాశాలను పిట్టలగూడెంకు తరలించాలని నిర్ణయించారు.

కళాశాలలో సీట్ల కేటాయింపు ఇలా..

బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ లో ప్రథమ సంవత్సరంకు 80 సీట్లు ఉన్నాయి. ఇటీవల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించినా నేరుగా కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఎంఈసీ, హెచ్‌ఈసీల గ్రూపుల్లో మొత్తం 80 సీట్లలో ముస్లిం, మైనార్టీలకు 51సీట్లు, క్రిస్టియన్ మైనార్టీలకు 5సీట్లు, పార్శీలు, సిక్కులు, బౌద్ధులకు ఒక్కో సీటు, నాన్ మైనార్టీ కోటాలో ఎస్సీలకు 5 సీట్లు, ఎస్టీలకు మూడు సీట్లు, బీసీలకు పది సీట్లు, ఓసీలకు రెండు చొప్పున కేటాయిస్తారు. ఇంటర్ రెండో సంవత్సరంలోనూ ఖాళీలను బట్టి అర్హులైన దరఖాస్తుదారులకు సీట్లు కెటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలోని ఉన్నత పాఠశాలలతోపాటు, పరిసర మండలాల పాఠశాలల్లో ఈ ఏడాది పదోతరగతి పూర్తి చేసే మైనార్టీ బాలుర విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువు కోసం ఈ కళాశాలలో చేరి సద్వినియోగం చేసుకోవాలి. ఈ ప్రాంతంలో ఎక్కడా లేనివిధంగా విశాలమైన గదులు, వరండా, సొంత భవనం, వసతి మిగతా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కళాశాల విద్యార్థులకు మంచి సౌకర్యవంతంగా ఉంటుంది.
– షేక్ సయ్యద్‌మియా, మైనార్టీ నాయకుడు

నాణ్యమైన విద్య, వసతి, భోజనం



తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 13 గురుకుల పాఠశాల, కళాశాల నడుస్తున్నాయి. ఉన్నతమైన విద్యా బోధనతో పాటు నాణ్యమైన భోజనం అందించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– విష్ణుమూర్తి గౌడ్, ప్రాంతీయ సమన్వయ అధికారి

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



తిరుమలగిరి : గంగమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మతల్లి, పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ కోటిరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడుతాయన్నారు. పార్టీలకు అతీతంగా నూతనంగా గుడి నిర్మాణాన్ని చేపటడ్డం సంతోషకరమన్నారు. పార్టీలకు అతీతంగా పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంజిత్ యాదవ్, స్థానిక సర్పంచ్ సునీత కృష్ణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పుట్లూరి రాజశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బుర్రి రాంరెడ్డి, పెద్దగొల్ల మెండె సైదయ్య, గ్రామస్తులు కాంసాని చంద్రశేఖర్, కూన్‌రెడ్డి లింగారెడ్డి, సాయిరెడ్డి, పొదిల మల్లయ్య, చల్ల మురళి, శ్రీను, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు, చిత్రంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు అత్యవసరంగా సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిస్కేస్టేషన్)ను చేసినట్లయితే ఆ వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శివాని విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఎమ్మెల్యే గుండెపోటుపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, కుందూరు నాగలక్ష్మీ, కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్, కందగట్ల అశోక్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండి.షోయబ్, ఎలుగుబెల్లి నాగరాజు, షేక్ ఫయాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని తాటికోల్ గ్రామానికి చెందిన పలువురు శనివారం దేవరకొండ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. తన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ సుభాష్‌గౌడ్, రెడ్డి, ఎంపీటీసీ ఉత్తరమ్మ, రవి, కాటం గౌడ్, కృష్ణ, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ కంటి వెలుగు...దేశానికి వెలుగు

పెద్దఅడిశర్లపల్లి : తెలంగాణ కంటి వెలుగు దేశానికి వెలుగు అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీంచి మాట్లాడారు. భౌతికంగా చూపు కోల్పోయిన వారికి తిరగి చూపు ప్రసాదించడానికి చేపట్టిన కార్యక్రమే కంటి వెలుగు అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. అనంతరం అద్దాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, ముత్యంరావు, పరమేష్, శీలంశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరకొండలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



వృద్ధురాలికి హామీల కరపత్రం అందజేస్తున్న బాలు నాయక్, తదితరులు

డిండి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే నేనావత్‌బాలు నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని టి.గౌరారం గ్రామపంచాయతీలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ సందర్భంగా మహిళలు, రైతులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, ఎస్టీసెల్ మండలాధ్యక్షుడు లక్పతినాయక్, సర్పంచ్ నాగేశ్వరరావు, సిరాజ్‌ఖాన్, కొర్ర రాంసింగ్, సిరాజ్‌ఖాన్, హరికృష్ణ, బద్యానాయక్, తేజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దవూర : మండలంలోని వెల్మగూడెంలో పలు దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. మొదటి రోజైన శుక్రవారం రాత్రి విగ్రహాలను గ్రామస్తులు ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో దేవాయానికి తీసుకెళ్లారు. రెండో రోజు విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, దీక్షాధారణం, యాగశాల ప్రవేశం, మాతృక వాస్తుయోగిని, క్షేత్రపాలక నవగ్రహాల సర్వతోభద్ర మండపారాధన, బ్రహ్మ కలశస్థాపనం, అగ్రిప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ ప్రతిష్ఠ విగ్రహాలకు జలాధివాసం, అవాహిత దేవతా హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాచిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి(డీవీఎన్‌రెడ్డి), సర్పంచ్ రావుల శ్రీను, గ్రామస్తులు దాచిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, హాలియా ఏఎంసీ వైస్ చైర్మన్ ఆడెపు రామలింగయ్య, ఉపసర్పంచ్ బాణాల శ్రీనివాసరావు, గ్రామస్తులు ధర్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, రావుల అంజయ్య, కొట్టె రామలింగయ్య, సత్యం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి పథకం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసే తల్లిదండ్రులకు అండగా ఉండేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు తీసుకొచ్చారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో పట్టణంలోని వీటీ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 125 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. శారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే అమలవుతున్నాయన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు జీఓ నంబర్లు 58, 59 ప్రకారం ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లగొండ పట్టణంలోని 156 మంది లబ్ధిదారులకు, తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రానున్న రోజుల్లో ఖాళీ స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వమే రూ.3లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పంకజ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, అభిమన్యు శ్రీనివాస్, దేప వెంకట్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్
- కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దేవరకొండ : ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మిర్యాలగూడ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకొండ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ తెలంగాణ మహిళా సమాజాన్ని కించపర్చే విధంగా మాట్లాడితే మహిళలు ఉపేక్షించరని ఆయన పేర్కొన్నారు. మహిళలను గౌరవించలేని అధ్యక్షుడున్న దౌర్భాగ్యపు పరిస్థితిలో బీజేపీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, చేరుపల్లి జయలక్ష్మి, పొన్నెబోయిన భూదేవి, తస్కీన్ సుల్తానా, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, రాహత్‌అలీ, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసనగా సాగర్ రోడ్డుపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మహిళలతో కలిసి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కామర్ల జనాయ్య, రామచంద్రయ్య, మహిళ అధ్యక్షురాలు మాధా ధనలక్ష్మీ, వనజ, పామోజు వెంకటాచారి పార్టీ కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపుమేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ స్థానిక రాజీవ్‌చౌక్ వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు నాగలక్ష్మి, పట్టణ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి

హాలియా : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హాలియా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడోజు సైదాచారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచు, గౌరవప్రదమైన ఎమ్మెల్సీ పదవీలో ఉన్న కవితపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బండి సంజయ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొండేటి అశోక్, యూత్ జనరల్ సెక్రటరీ పూర అఖిల్, గార్లపాటి నరేష్, శివ, కనకరాజు నాగరాజు పాల్గొన్నారు.



హాలియా : పోలీస్‌స్టేషన్‌లో బండి సంజయ్‌పై ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ యూత్ సభ్యులు

డిండి : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కించపరిచేవిధంగా వ్యాక్యలు చేశారని ఆరోపిస్తూ మండల బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారిపై కాసేపు బైఠాయించి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన తెలిపిన వారిలో సర్పంచ్‌మేకల సాయమ్మ, ఎంపీటీసీ వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మేకల కాశన్న, బల్మూల తిర్పతయ్య, గుర్రం సురేష్ సురేష్, ఖలీం, పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ,సర్పంచ్ గోర్ల సైదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు వల్లపురెడ్డి, స్థానిక సర్పంచ్ గోర్ల సైదమ్మ శ్రీనివాస్, నర్సింహా, చందూనాయక్, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు స్థానిక చౌరస్తా వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూ నాయక్, బద్దునాయక్, గోవిందునాయక్, లాలయ్య, తందూరి కళావతి, బొడ్డుపల్లి ధనమ్మ, సంధ్య, పద్మావతి, లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

చందంపేట : ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసుల కవితఅనంతగిరి, శివ, శ్రీశైలం, సోను, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



చందంపేటలో..



కొండమల్లేపల్లిలో..



త్రిపురారంలో ..

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

దేవరకొండ : ఈనెల 15నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఏర్పాటు చేయనున్న ఆయా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హాల్‌టికెట్‌ల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే ప్రైవేట్ విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్షల నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆయన కోరారు. ఈ సమావేశంలో రాము, అనిల్, రాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం. బాలాజీనాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడుతుంటారని, ఆ విధంగా నిర్భయంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు పరీక్షల సమయాన్ని వృథా చేయొద్దని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్ మాట్లా డుతూ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇందుగుల, వేములపల్లి, చెన్నాయిపాలెం, ఆగామోత్కూర్, నీలాయిగూడెం పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, ఎ. అరుణాకుమారీ, వెంకన్న, లక్ష్మణ్, గోపి, పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీషలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన క్రియతో ఆత్మవిశ్వాసం

నల్లగొండ టూటౌన్: ఉరుకుల పరుగుల ప్రస్తుత సమాజంలో సుదర్శన క్రియతో ప్రతి మనిషిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ప్రారంభమైన సుదర్శన క్రియ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మానసిక ఒత్తిడి ఉన్న ప్రతిఒక్కరూ సుదర్శన క్రియ, యోగాసనాలు చేసినట్లయితే ఎలాంటి మానసిక, అనారోగ్య సమస్యలు దరిచేరవని అన్నారు. సుదర్శన క్రియ అనేది మన మనసును, భావోద్వేగాలను నియంత్రించగల ఒక ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.